క్లుప్తంగా

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

నంద్యాల టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి నంద్యాల సేవా ప్రగతి క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఏపీ ఎస్పీడీసీఎల్ ఉద్యోగి శంకరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆక్సిజన్ కాన్సంట్రేటర్, నెబ్యులైజర్, హాస్పిటల్ కాట్, హాల్డ్ డబుల్ బెడ్, చైర్ అందజేశారు. ఫీడ్ ది హంగర్ లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పెసల శ్రీకాంత్ ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): 34 ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీ రామకృష్ణ విద్యాలయం రిటైర్డు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పట్టణంలోని రాజారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం 1988–1989 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా పాల్గొన్నారు. అందరూ ఏకకాలంలో ఒకే వేదిక పైకి చేరడంతో ఉల్లాసంగా గడిపారు. నాటి స్మృతులను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. కబుర్లు చెప్పుకుంటూ, క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు నరసింహారావు, శ్రీరాములు, సుబ్బారెడ్డి, మల్లికార్జున రావు, శేఖర్, బాలగంగాధర్, రామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. సమావేశానికి కృషి చేసిన స్నేహితులను సన్మానించారు. 2025లో మరోసారి కలవాలని నిర్ణయించారు.

ఉల్లాసంగా..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో 26 సంవత్సరాల తర్వాత బీకాం జనరల్ విద్యార్థులు కలుసుకున్నారు. సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన వహించారు. 1994–97లో చదువుకున్న 45 మంది బీకాం జనరల్ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని సంతోషంగా గడిపారు. నాటి అధ్యాపకులను సన్మానించారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, పూర్వ అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, రామకృష్ణుడు, హనుమంతరావు, భాస్కరరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం



మహిళలతో మాట్లాడుతున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గాయిత్రీ దేవాలయం వీధిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సోముల రాధ, మోబిన్, చక్రపాణి, రమేష్‌గౌడ్, న్యాయవాది సరిత, నజీర్, ఆజాద్, రాజారెడ్డి ఉన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

నంద్యాల(అర్బన్): మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు, జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ పోటీలతో పాటు లోకల్ పోటీలు టెన్నికాయిట్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 26న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మిగిలిన రోజుల్లో ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

అహోబిలేశుడి సేవలో..



పీఠాధిపతి ఆశీర్వాదం పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వారిని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కార్తికేయన్ సోమ వారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదల్లో భాగంగా ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ క్షేత్రాల్లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ఆయనకు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. చివరగా అహోబిలం మఠం చేరుకుని పీఠాధిపతి శ్రీ రంగరాజ యతీంద్ర మహాదేశికన్ను దర్శించుకుని ఆశీర్వచనం పొందారు.

పట్టణవాసులకు ఆహ్లాదం

నాడు: గత పాలకుల నిర్లక్ష్యంతో పార్కులు చెత్త కుప్పలతో, పందులు, కుక్కలకు ఆవాసాలుగా ఉండిపోయాయి. జనసంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా ఉండేవి. వినియోగంలో లేకపోవడం, నిర్వహణ లోపించడంతో ముళ్లపొదలు పెరిగిపోయాయి. పట్టణ నడిబొడ్డున ఆహ్లాదాన్ని పంచాల్సిన స్థలాలు నిరుపయోగంగా, వ్యర్థ కేంద్రాలుగా మిగిలిపోయాయి.

నేడు: వివిధ రకాల చెట్లు, మొక్కలు, పచ్చటి గడ్డితో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయలను వెచ్చించి ఆహ్లాద కేంద్రాలుగా రూపుదిద్దింది. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసే వారికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేసింది. ఇక కుటుంబాలు పిల్లలతో గడిపేందుకు ఆటవిడుపు పరికరాలు సిద్ధంగా ఉంచింది. సకల సౌకర్యాలతో ప్రజలకు మానసిక ప్రశాంతతను చేకూరుస్తున్నాయి.

చిన్నచెరువు పార్కులో ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్ పరికరాలు



ఉరుకులు, పరుగులు జీవితంలో అలసిన మనసులకు ఆహ్లాదం పంచేలా పట్టణంలోని పార్కులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. గతంలో పార్కులు అసాంఘిక కార్యకలాపాలు, పందులు, కుక్కలకు ఆవాసాలుగా ఉండేవి. నేడు తెల్లవారుజామున శారీరక, మానసిక వ్యాయామం చేసుకునే వారికి తగిన వసతులు కల్పించింది. అలాగే పచ్చదనంతో పాటు చిన్నారులకు ఆటవిడుపునకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచింది.

- నంద్యాలలో రూ.5.24 కోట్లతో పార్కుల అభివృద్ధి
- పట్టణంలో 8 పార్కుల ఏర్పాటు
- వాటి నిర్వహణకు రూ.14.30 లక్షలతో ఏర్పాట్లు
- శారీరక వ్యాయామానికి పరికరాలు, యోగా కోసం ప్రత్యేక ఏర్పాట్లు



ఆహ్లాదంగా రైతుబజార్ పార్క్

నంద్యాల(సిటీ): గత ప్రభుత్వాలు పార్కుల అభివృద్ధిని విస్మరించినా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటిని ఉన్నతంగా తీర్చిదిద్ది నగరాలకు ధీటుగా సుందరీకరించారు. నంద్యాల పట్టణంలో నాలుగు సంవత్సరాల కాలంలో సుమారుగా రూ.5.24 కోట్లతో 8 పార్కులను అభివృద్ధి చేశారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు అన్ని వసతులతో పార్కులను రూపొందిస్తున్నారు.

చిన్నారుల కోసం ఆటవస్తువులు..

చిన్నారుల ఆటవిడుపు కోసం ఆట వస్తువులను పలు పార్కుల్లో ఏర్పాటు చేశారు. ఎన్‌జీవో కాలనీ, లలితా నగర్ ప్రాంతాల్లోని పార్కులలో చిన్నారులు ఆడుకోవడానికి పలు రకాల క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు.

జిమ్ సదుపాయాల కల్పన..

పార్కులు అంటే కేవలం కాసేపు కాలాయాపన చేసేవి కాకుండా వాటి వల్ల యువతీ యువకులకు వేర్వేరుగా జిమ్ యంత్రాలను అమర్చారు. ముఖ్యంగా చెరువుకట్ట వద్ద, పార్క్ రోడ్ వద్ద ఉన్న పార్కుల్లో ఉదయం వందలాది మంది వాకింగ్ చేయడంతో పాటు ఓపెన్ జిమ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే ఆయా పార్కుల్లో యోగా చేయడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.



లలితానగర్ పార్కును రూపుదిద్దిన దృశ్యం

పార్కుల నిర్వహణకు ప్రత్యేక చర్యలు



పట్టణంలోని 8 పార్కులను ప్రత్యేకంగా, ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం. ఒక్కో పార్కు నిర్వహణకు ప్రతి నెలా రూ.20వేలు వెచ్చిస్తున్నాం. ముఖ్యంగా పార్కుల వద్ద ఎల్‌ఈడీ లైట్లు, శానిటేషన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లతో పాటు గడ్డి ఏపుగా పెరగకుండా ఎప్పటికప్పుడు కట్ చేస్తున్నాం. పాదాచారులకు, చిన్నారులకు వాకింగ్ చేయడానికి ట్రాక్‌లు ఏర్పాటు చేశాం. పార్కుల మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నాం.

– రవిచంద్రారెడ్డి మున్సిపల్ కమిషనర్, నంద్యాల

పట్టణంలోని పార్కులు ఇలా..

- ముస్సిపల్ టౌన్ హాల్‌వద్ద 1.01ఎకరాల్లో సుమారు రూ.50 లక్షలతో పార్కును అభివృద్ధి చేశారు. ఇక్కడ యోగా కేంద్రాన్ని నెలకొల్పి సుమారుగా 150 మందికి పైగా యోగా చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు.
- లలితానగర్‌లో 1.59 ఎకరాల్లో ఓపెన్ జిమ్, చిన్నారులకు ఆటస్థలం, షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.90 లక్షల మేర మున్సిపల్ అధికారులు వెచ్చించారు.
- విద్యానగర్‌లో 0.39 సెంట్ల మున్సిపల్ స్థలంలో రూ.45లక్షలతో గ్రీనరీతో కూడిన పార్కు ఏర్పాటు చేశారు.
- ఆటోనగర్ వద్ద 0.20 సెంట్ల స్థలంలో ఓవర్ బ్రిడ్జ్ కింద రూ.25 లక్షలతో గ్రీనరీ గార్డెన్‌తో పాటు గోడలకు పలు రకాల చిత్రాలు వేశారు.
- హౌసింగ్‌బోర్డు వద్ద 2.9 ఎకరాలల్లో రూ.1.84 కోట్లతో ఓపెన్ జిమ్, ఆటవస్తువులు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- చెరువుకట్ట వద్ద పాదాచారుల నడక కోసం 2.5 కి.మీ. వాకింగ్ ట్రాక్, స్త్రీలకు, పురుషులకు ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ సెంటర్లు, గ్రీన్ గార్డెన్లను రూ.55లక్షలతో అభివృద్ధి చేశారు.
- రైతు బజార్ వద్ద 50 సెంట్లలో అత్యాధునిక వసతులతో గ్రీన్ గార్డెన్‌తో పాటు ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ను రూ.40లక్షలతో ఏర్పాటు చేశారు.
- హౌసింగ్‌బోర్డు–2లో 1.4 ఎకరాల్లో సుమారు రూ.60 లక్షలతో పార్కు, ప్రహరీ, గ్రీనరీ ఏర్పాటు చేశారు.

మనస్సుకు ప్రశాంతంగా ఉంటుంది



కొంత కాలంగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నా. పని ఒత్తిడిని తగ్గించుకునేందుకు సాయంత్రం రైతుబజార్ పార్క్‌లో కాసేపు గపుడుతాను. అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు చాలా మంది కుటుంబాలతో వస్తుంటారు. పచ్చని గడ్డి, అక్కడి వాతావరణం మనస్సుకు ప్రశాంతతనిస్తుంది. ప్రతి రోజూ పార్కులో కాసేపు వాకింగ్ చేశాక ఇంటికి వెళ్తా. – సుధీర్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి, నంద్యాల.

క్రీస్తు జననం మానవాళికి శుభదినం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- ముస్తాబయిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు
- అర్ధరాత్రి నుంచి శిలువ ఊరేగింపు
- దైవసందేశమిచ్చిన మత పెద్దలు

నంద్యాల(న్యూటౌన్): క్రీస్తు జననం మానవాళికి శుభదినమని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మేస ఆంథోని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఈ శుభదినం ప్రజలందరికీ కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానం అని సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ ది రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ హోలీక్రాస్ కెథడ్రల్, హోసన్నమందిరం, తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ఆరాధనలో ఆంథోని ప్రసన్నకుమార్, పి.సాల్మన్‌రాజు, విజయ్‌భాస్కర్ దైవ సందేశాన్ని అందించారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు...

పరిశుద్ధ మత్తయి దేవాలయం, ఎంఎస్ నగర్‌లోని ఏసుకృప ప్రార్థనా మందిరంలో అందనం సుధాకర్, టెక్కె సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ సుమిత్ర, పరిశుద్ధ మత్తయి దేవాలయంలో రెవరెండ్ బెంజమాన్, వైఎస్‌నగర్‌లో క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో రాజారావు, జయరాజు, ఏబీఎం రక్షణాలయం, కర్మేలు ప్రార్థనా మందిరం, నూనెపల్లెలోని సీఎస్ఐ చర్చి, రిడంప్షన్ గ్లోబల్ చర్చి, డేనియల్ పురంలోని సీఎస్ఐ చర్చిలలో క్రిస్మస్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. హోలీక్రాస్ కెథడ్రల్(పెద్ద చర్చి)లో వేలాదిమంది క్రైస్తవులు ప్రత్యేక పార్థనలకు బారులుదీరారు. పలు ఆలయంలో ఏర్పాటు చేసిన శాంతాక్లాజ్ ప్రత్యేక ఆకర్షణగానిలిచాయి.

శిరివెళ్ల: మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, మహదేవపురం, బోయలకుంట్ల, చెన్నూరు చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు బోధనలను పాటించాలని ఫాదర్లు బోధించారు. వేడుకలు పురస్కరించుకొని రంగు, రంగుల విద్యుత్ బల్బులతో చర్చీలను అలంకరించారు.

రుద్రవరం: మండలంలోని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జన్మ దినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే వేడుకల ను ప్రారంభించారు. ఇందులో భాగంగా క్రైస్తవులు శిలువనెత్తుకొని మేళ తాళాలతో గ్రామోత్సవం గావించారు. మత బోధకులు ప్రభువు సందేశాన్ని వినిపించారు.



నంద్యాల తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి



నంద్యాల ఆల్‌సెయింట్ చర్చిలో సందేశమిస్తున్న రెవరెండ్ విజయ్‌కుమార్



ఆళ్లగడ్డ సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



ముత్యాలపాడు చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్‌లు



ఆళ్లగడ్డ ఇమ్మానియల్ టౌన్ చర్చిలో కొవ్వొత్తి వెలిగిస్తున్న పాస్టర్ సునీల్ కుమార్



రుద్రవరంలో శిలువను ఊరేగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు రాకను స్తుతిస్తూ ప్రార్థన మందిరాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ, హోసన్నా, యరుసలేం మందిరాల్లో పలువురు ఉపవాస దీక్షలతో ప్రార్థనలు చేశారు. పాస్టర్లు రమేష్‌బాబు, రవికుమార్, హిట్లర్, రాజు భక్తులకు దైవ సందేశాన్ని వినిపించారు.

దొర్నిపాడు: మండలంలో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సోమవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కేక్‌లు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రిష్టిపాడు చర్చి వద్ద యువకులు చిన్నారులు, మహిళలకు క్రీడాపోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆళ్లగడ్డ: కరుణామయుడి జన్మదిన ఘట్టాన్ని క్రైస్తవులు అందోత్సాహాలతో జరుపుకున్నారు. క్రీస్తు రాకను స్తుతిస్తూ ప్రార్థనా మందిరాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు అలరించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు విజయ డెయిరీ చైర్మమెన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, గంగుల విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్‌లు రెవ. జీవి చంద్రశెఖర్‌రావు, సంపత్‌కుమార్, సంజీవరాయుడు, చిరంజీవి, జాన్ ప్రభాకర్ క్రీస్తు సందేశాన్నిస్తూ వివరించారు.



చాపిరేవుల పూల ఆంథోని చర్చిలో బాలఏసు విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కానాల సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



ముత్యాలపాడు చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



శిరివెళ్ల చర్చిలో అర్ధరాత్రి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఆళ్లగడ్డలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



ఉయ్యాలవాడలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్ రమేష్‌బాబు

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



ఎర్రగుడిదిన్నెలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రుద్రవరం: ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి, అలా కాకుండా ఇష్టారీతిన మాట్లాడటం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి అఖిలప్రియపై సింగిల్ విండో డైరెక్టర్ పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఎర్రగుడిదిన్నెలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బంధువు 19వ బ్లాక్ తెలుగుగంగ కాల్వ ద్వారా వచ్చే నీటిని ఎర్రగుడిదిన్నె చెరువుకు మళ్లించుకున్నారని, రైతులు డబ్బులు చెల్లిస్తేనే నీరు వదులుతామని, సొమ్ము ఇవ్వకపోవడంతో మాచినేనిపల్లె, చందలూరు, మందలూరు గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయని ఆరోపణలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నీరు వదలకపోతే ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సాగు చేసిన రెండో పంటలు చివరి దశలో ఉన్నాయని, మరో తడి ఇస్తే పంటలు చేతికొస్తాయన్నారు. ఇటీవల తెలుగగంగ కాల్వకు నీరు విడుదల చేయడంతో చెరువును నింపి ఆ నీటి ఆధారంగా వరి, మినుము, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారని చెప్పారు. కనీసం రైతులతోనైనా మాట్లాడకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి నీటిని విడుదల చేయించి కాల్వలపై పర్యటిస్తూ రైతులకు ధైర్యం చెబుతున్నారని, అలాంటి వారి చిత్తశుద్ధిని శంకించడం సరికాదని హితవుపలికారు. ఇప్పటికైనా గాలివాటం మాటలు మానుకుంటే మంచిదన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

శిరివెళ్ల: శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన 28వ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. శిరివెళ్ల మెట్ట శ్రీ కాశినాయన ఆశ్రమంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమం జరిగింది.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మహానంది చేరిన అక్షితలు

మహానంది: జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగే రామ జన్మభూమి ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షితలను సోమవారం మహానందికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ అక్షితలు పంపిణీ చేస్తామన్నారు.

చర్చి పెద్దపై పోలీసుల దాడి

సాక్షి, నంద్యాల: చర్చి విషయంలో తలదూర్చి బాధితులపై దాడికి పాల్పడ్డారు పోలీసులు. దీంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.. పాములపాడు మండలం వాడాల గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు జరుగుతుండగా చందాల విషయంలో చర్చి పెద్ద మనిషి వెంకటరమణతో కానిస్టేబుళ్లు రాఘవేంద్ర, ప్రతాప్, వీఆర్ కానిస్టేబుల్ మురహరి ప్రతాప్ వాదనకు దిగారు. ఇరు వర్గాల మధ్య మాటామాట పెరిగింది. కోపోద్రిక్తులైన రాఘవేంద్ర, ప్రతాప్, మురహరి ప్రతాప్ ఒక్కసారిగా వెంకటరమణతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై దాడికి దిగారు. దాడిలో వెంకటరమణ తలకు గాయం కాగా, ఆయన భార్య, కుమార్తెకు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారని, రాజీకి రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిని వివరణ కోరగా.. దాడి ఘటన వాస్తవమేనని, నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



అచీవ్‌మెంట్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, బెస్ట్ టీచర్ అవార్డులు నంద్యాలకు రావడం గర్వకారణమని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఉర్దూ కవిత్వంలో షేక్ ఆఫీసర్ రహిమాన్ నియాజీ, ఉర్దూ భాష అభివృద్ధిలో ఎం.విజమార్కుకు లైఫ్‌టైమ్ అచీవ్ మెంట్ అవార్డు, ఉర్దూ బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని రియాసతీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అభినందన సభకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉర్దూ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ఉర్దూ టీచర్స్, కళాశాలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని త్వరలో అందజేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కోఆప్షన్ మెంబర్ సలాముల్లా, న్యాయవాది బదానీ పాల్గొన్నారు.